క్లుప్తంగా

టీకాలతో గాలికుంటు నివారణ



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి

గోనెగండ్ల: పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయిస్తే గాలికుంటు వ్యాధిని నివారించ వచ్చని విజయవాడ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ కె. భూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలం లోని వీరంపల్లి గ్రామంలో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ జి. శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. పశువులకు పశువైద్యులు టీకాలు వేస్తున్నారా లేదా అని పాడి రైతులను అడిగి తెలుసుకున్నారు. గోనెగండ్ల సహాయ సంచాలకులు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, వైద్యులు ఎం.మహమ్మద్ అలీ, పశుసంవర్ధక శాఖ సహాయకులు వినయ్ కుమార్, ఇస్మాయిల్, శంషాద్‌బేగం పాల్గొన్నారు.

ప్రమాద సూచికలు ఏర్పాటు చేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శేఖర్‌నాయుడు, ఎంపీజే నాయకులు చాంద్‌బాషా, మహమ్మద్ అలీ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఏఈ విజయనరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఓం శాంతి సర్కిల్, కమిటీ రోడ్డు, లక్ష్మణ్ టాకీస్, ఎద్దుల మార్కెట్ వద్ద స్పీడ్ బ్రేకర్ల వద్ద ఎలాంటి ప్రమాద సూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

పిల్లల సంరక్షణపై అవగాహన

ఆదోని సెంట్రల్: పట్టణ, గ్రామీణ ప్రాంతంలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు పిల్లల సంరక్షణపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో రెండో రోజు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పోష ణబీ పడాయిబీ ఫేస్–2పై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ల పిల్లల వరకు వారి ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆటపాటలతో విద్య బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లీలావతి, సావిత్రి, రాగిణి వసంత, భార్గవి, మహాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు.శుక్రవారం పట్టణంలోని షరాఫ్ బజార్, కొండవీటి ప్రాంతం, మల్లారి వీధి ప్రాంతాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే.. పట్టణంలోని పార్క్ రోడ్డు, హెచ్‌బీఎస్ కాలనీ, కమిటీ రోడ్డు, కర్నూలు బైపాస్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు.

ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సులీలమ్మ సూచించారు. శుక్రవారం కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ,శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో అమిటి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం, బ్లూ ఓషన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగ యువతీయువకులను ఇంటర్వ్యూ చేశారు. జాబ్‌మేళాలో 36 మంది అభ్యర్థులు పాల్గొనగా 20 మంది ఎంపికయ్యారు. వారిలో తమ కళాశాలకు చెందిన 4గురు విద్యార్థులు ఉన్నారని చెప్పారు. ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ న్యూటన్‌బాబు,జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సాయితేజ, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయం మార్చాలి

పెద్దకడబూరు : ఎమ్మిగనూరులో ఉన్న విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీరు కార్యాలయాన్ని మండల కేంద్రం పెద్ద కడబూరుకు మార్చాలని ఆర్‌పీవీఎఫ్, డీఎస్‌వైవై విద్యార్థి సంఘాల నాయకులు ఖాజా, కృష్ణ, వెంకటేష్ డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరులోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో శుక్రవారం ఈఈ విజయరాజును కలసి వినతపత్రం సమర్పించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కౌతాళం: ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలకు శుక్రవారం ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్ప కౌతాళంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మండల ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించాలని ఈ సందర్భంగా ఆయన దీక్షపరులను కోరారు.

కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పెద్దకడబూరు : మంత్రాలయం నియోజకవర్గంలోని ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు భాస్కర్‌యాదవ్, శాఖ కార్యదర్శి పంపాపతి డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులను కలిసి కలసి వినతిపత్రం సమర్పించారు.

మదినిండా మల్లన్న!



నందవరం మీదుగా పాదయాత్రగా వెళ్తున్న కన్నడిగులు

- కాలినడకన శ్రీశైలానికి
- కొనసాగుతున్న కర్ణాటక భక్తుల పాదయాత్ర
- భక్తుల సేవలో దాతలు..
- దారి పొడవునా అన్నదానం, మజ్జిగ పంపిణీ



మధ్యాహ్న వేళ చెట్ల కింద విశ్రమించిన భక్తులు



నందవరంలో పాదయాత్ర భక్తులకు మజ్జిగ అందిస్తున్న రైతులు



మంత్రాలయం..ఎండను లెక్కచేయకుండా పాదయాత్రగా వెళ్తున్న కర్ణాటక భక్తులు

నందవరం : ఉగాది పర్వదినం సందర్భంగా..తమ ఆడపడచు భ్రమరాంబదేవిని దర్శించుకుని, సారె సమర్పించేందుకు కర్ణాటక రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఓం నమః శివాయ నామ స్మరణతో పాటు భజన పాటలు పాడుకుంటూ కాలినడకన వెళ్తున్నారు. వారం రోజులుగా కన్నడిగుల పాదయాత్ర మొదలైనా.. రెండు రోజుల నుంచి భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం వేలాదిగా తరలి వెళుతున్నారు. భక్తులకు ఇబ్బందులో లేకుండా మండల కేంద్రం నందవరంతో పాటు జోహరాపురం, సోమలగూడూరు, పొనకలదిన్నె గ్రామాల్లో దాతలు అన్నదానం చేస్తున్నారు. అలాగే మధ్యాహ్న వేళల్లో మజ్జిగ అందజేస్తున్నారు. పలుచోట్ల వారు సేదతీరేందుకు టెంట్లు ఏర్పాటు చేసి నీటిని అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలో వీరశైవ లింగాయతుల ఆధ్వర్యంలో, ఆయా గ్రామాల్లో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, రైతులు కన్నడిగులకు సేవ ధృక్పథంతో అన్నదాన కేంద్రాలు, మజ్జిగ, తాగునీటి వసతి వంటివి ఏర్పాటు చేశారు. అలాగే.. కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట జిల్లా మహాలింగాపూర్ గ్రామ దివ్యాంగులు స్కూటర్లపై శ్రీశైలం బయలుదేరారు.

ఉచిత వైద్య శిబిరం

గోనెగండ్ల: శ్రీశైలంకు పాదయాత్ర ద్వారా వెళ్లే భక్తుల కోసం మండల కేంద్రం గోనెగండ్లలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫార్మసిస్టు కృష్ణ కుమార్, ఆర్‌ఎంపీ జిల్లా సంఘం నాయకులు ఉస్మాన్‌మియ్యా. నాగేశ్వర రెడ్డి ఉచిత వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని ఎల్ ఐసీ సీనియర్ బిజినెస్ అసోసియేట్ పాటిల్ తిమ్మారెడ్డి ప్రారంభించారు.



పాదయాత్రికులకు ఉచితంగా మందులు అందజేస్తున్న ఆర్‌ఎంపీలు



స్కూటర్లపై నందవరం చేరుకున్న దివ్యాంగులు ముత్తురాజు, బసవరాజు

సంపూర్ణ పోషణే లక్ష్యం

కోసిగి: అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలకు సంపూర్ణ పోషణ, సంపూర్ణ చదువు అందించడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ నరసమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూరీబా గాంధీ బాలికల పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

విద్యార్థినికి డీఈఓ ఆర్థిక సాయం



చిన్నారినితో విషయాలను తెలుసుకుంటున్న డీఈఓ శామ్యూల్ పాల్

మంత్రాలయం: కోసిగి మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని సన్నక్కి చిన్నారి తల్లిదండ్రులతో వలస వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న విద్యాధికారులు ఆ విద్యార్థినిని పబ్లిక్ పరీక్షలు రాసేందుకు స్వగ్రామానికి రప్పించారు. ఇప్పటికే ఆ బాలిక రెండు సబ్జెక్ట్ పరీక్షలు గైర్హాజరైన విషయం విదితమే. శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష హాజరైంది. కోసిగి మండలంలో పర్యటించిన జిల్లా విద్యాధికారి శ్యాముల్ పాల్ చిన్నారి పరీక్ష రాస్తున్న మౌంట్ కార్మెల్ స్కూల్‌ను సందర్శించారు. పరీక్ష ముగిసిన తర్వాత ఆ విద్యార్థినితో ముచ్చటించి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. తర్వాత రూ.5వేలు నగదు ఆర్థిక సాయం అందజేశారు. పరీక్షలు బాగా రాయాలని విద్యార్థినికి ధైర్యం చెప్పారు.

పోటాపోటీగా పంచాయతీ వేలాలు

కోసిగి: కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ దుకాణాల నిర్వహణకు 2025–2026 ఆర్థిక సంవత్సరానికి వేలాలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ అయ్య మ్మ అధ్యక్షతన డీఎల్‌పీ నూర్జహాన్, పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. ఇందులో వారపు సంత మార్కెట్‌ను రణ తిక్కన్న రూ.4,55,000 కు, బండిమెట్టను పి. మధు రూ.27,20,000 కు, చిన్న కమేళాను ఖలంధర్ రూ.33,000కు, పెద్దకమేళాను మాణిక్యరాజు రూ.35,000కు కైవసం చేసుకున్నారు. పంచాయతీకి ఈఏడాది మొత్తం 32,43,000 ఆదాయం సమకూరిందని తెలిపారు. 01-04-2025 నుంచి 31-03-2026వ తేది వరకు ఆయా పరిధిలో పంచాయతీ నిబంధనల మేరకు పన్నులు వసూళ్లు చేసుకోవచ్చునన్నారు. గతేడాదితో పోలిస్తే ఈఏడాది రూ.23,72,000 ఆదాయం అదనంగా సమకూరిందని అధికారులు తెలిపారు. వేలం పాటల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంత రెడ్డి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డి హారూన్ రషీద్, మండిగిరి పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గ్రేడింగ్‌పై యార్డు అధికారులకు ఫిర్యాదు



రెండు, మూడుసార్లు గ్రేడింగ్ చేసేందుకు వచ్చిన కూలీలను తిరిగి పంపుతున్న రైతు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రెండు, మూడుసార్లు వేరుశనగక్కాయలను గ్రేడింగ్ చేస్తున్నారని హొళగుంద మండలం సమ్మతగేరి గ్రామానికి చెందిన రైతు పాపన్న శుక్రవారం యార్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. భాగ్యలక్ష్మి ఆయిల్ ట్రేడర్స్ అనే వ్యాపారి పాపన్నకు చెందిన వేరుశనగ కాయల దిగుబడిని రూ.5,833కి దక్కించుకున్నాడు. మొదటిసారిగా 63 సంచులను 23 మంది కూలీలతో గ్రేడింగ్ చేసి వెళ్లిపోయారు. రెండోసారి 20 మంది కూలీలతో గ్రేడింగ్ చేశారు. మరోసారి చెత్తా, చెదారం తీయడానికి గ్రేడింగ్ చేసేందుకు వచ్చారు. దీంతో రైతుకు కోపం వచ్చి ఎన్నిసార్లు గ్రేడింగ్ చేస్తారు, ఇప్పటికే సమయం ఆరు గంటలవుతోంది. మేము ఇళ్లకు వెళ్లాలా, ఇక్కడే ఉండాలా అని వ్యాపారి, కూలీలను నిలదీశాడు. గ్రేడింగ్ చేస్తేనే దిగుబడిని తీసుకుంటామని, లేకపోతే అవసరంలేదని చెప్పడంతో రైతు యార్డు అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మరలా ఆ దిగుబడులను వ్యాపారస్తుడికి ఇవ్వకుండా క్యాన్సిల్ చేసి మరోచోట నిట్టు వేశారు.

కవిత్వాన్ని ఆస్వాదిస్తే మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు బసప్ప

ఆదోని సెంట్రల్: ఉరుకులు పరుగుల జీవితంలో కవిత్వాన్ని ఆస్వాదిస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప అన్నారు. శుక్రవారం నైస్ అకాడమీలో ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహించారు. కవిత అనేది సమాజానికి దిక్సూచి లాంటిదన్నారు. అరసం జిల్లా కార్యదర్శి మల్లికార్జున, సాహితీ స్రవంతి గౌరవ అధ్యక్షుడు నాగమణి మాట్లాడుతూ.. కవితలు సామాజిక స్పృహ కలిగించేవిగా ఉండాలన్నారు. కవిత్వం విశిష్టత, గొప్పతనాన్ని వివరించారు. సాహితీ స్రవంతి సభ్యులు నల్లారెడ్డి, సక్కిరి భాస్కర్, రామలక్ష్మి, నాగజ్యోతి, సువర్ణజోషి, సుబ్బన్న తదితరులు పాల్గొని తమ కవితలను వినిపించారు.

నాటుసారా తయారీకి బెల్లం విక్రయిస్తే చర్యలు



కిరాణ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి

కోసిగి: నాటు సారా తయారీకి బెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కోసిగి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ భార్గవ్ రెడ్డి వ్యాపారులకు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కోసిగిలోని పలువురు కిరాణం వ్యాపారులతో సమావేశమయ్యారు. ఎవరైనా 5 కిలోలకు పైగా బెల్లం తీసుకెళ్లితే వారి సమాచారం తమకు ఇవ్వాలని సూచించారు. దుకాణాల్లో, ఇతర ప్రాంతాల్లో అక్రమంగా బెల్లం నిల్వ ఉంచినా, సరఫరా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి



ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘం నాయకుల నిరసన

మంత్రాలయం : మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా సహాయక కార్యదర్శి తామస్, తాలూకా అధ్యక్షుడు జాఫర్ పటేల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం మండల అధ్యక్షుడు కె. చిన్నా ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ వందపడకల ఆసుపత్రి నిర్మాణం పునాదులకే పరిమితమైందన్నారు. పనులు వేగవంతం చేయాలని నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే క్రీడకారుల కోసం ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేయించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను మూసివేయడం తగదు



ముగతిలో అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నందవరం : ఆదర్శ ప్రాథమిక పాఠశాలల పేరుతో ప్రాథమిక పాఠశాలలను మూసివేయడం తగదని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు దావీదు, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని ముగతి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 24వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీనియర్ నాయకులు అబ్దుల్‌రహేమాన్, పరమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో 33 వేల ప్రాథమిక పాఠశాలలుంటే పంచాయతీకి ఒకటి చొప్పున 13 వేల పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చి మిగిలిన 20 వేల పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా మారుస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అంటే రాష్ట్రంలో 20 వేల ప్రాథమిక పాఠశాలలను మూసివేయడమేనని విమర్శించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు దేవపాల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంట్రాముడు, నాగరాజు, ఆర్థిక కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

గోనెగండ్ల: మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామ సమీపంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ విజయ భాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. చిన్నమరివీడు గ్రామానికి చెందిన వెంకటేష్ మద్యం షాపుల నుంచి మద్యం బాటిళ్లను అక్రమంగా తెచ్చుకొని గ్రామ శివారులో అమ్ముతున్నాడనే సమాచారం మేరకు సిబ్బంది వెళ్లి దాడి చేసి అరెస్టు చేసి 51 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో భగత్ సింగ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని స్థానిక భగత్ సింగ్ యువజన సంఘం పట్టణ కార్యదర్శి చిన్ని ప్రసాద్ కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. దేశంకోసం ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని సంతెకుడ్లూరు గ్రామానికి చెందిన అలిగేరి ఉలిగప్ప తన ఇంటి వద్ద అక్రమంగా కర్ణాటక మద్యాన్ని అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర శుక్రవారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 90 ఎంఎల్ పరిమాణం గల 42 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

'పది' పరీక్షకు 29 మంది గైర్హాజరు

ఆదోని సెంట్రల్: నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షకు 29 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 19 కేంద్రాల్లో ఇంగ్లిష్ పరీక్షను 3,777 మంది రాయాల్సి ఉండగా 3747 మంది పరీక్ష రాశారు.

చీటింగ్ కేసు నమోదు

ఎమ్మిగనూరురూరల్: బెంగళూరుకు చెందిన అబ్దుల్ మూతలిబ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వి. శ్రీనివాసులు శుక్రవారం రాత్రి తెలిపారు. పట్టణానికి చెందిన బిస్మిల్లా ఆటో మొబైల్‌కు చెందిన కటికె ఉశేని తన రెండు ప్యాసింజర్ బస్సులను అబ్దుల్‌మాతలిబ్‌కు రూ.90 లక్షలకు విక్రయించాడు. ఆయన రూ. 5లక్షలు చెల్లించి మిగతా రూ.85 లక్షలు 2025 జనవరి లోపు చెల్లిస్తానని చెప్పి ఇంత వరకు చెల్లించలేదని చెప్పారు. బ్యాలెన్స్ కోసం కాల్ చేస్తే అబ్దుల్ స్పందించకపోగా.. బెదిరింపులకు పాల్పడుతుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే.. బస్సుల రిజిస్ట్రేషన్ నంబర్లు మార్చి విజయవాడ, గుంటూరు ప్రాంతాల ప్యాసింజర్ బస్సులుగా తిప్పుతుండగా అనుమానం వచ్చి బస్సులను స్టేషన్‌కు తీసుకువచ్చామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదంపై హర్షం

కోసిగి: ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ, శాసన మండలిలో ఎస్సీ వర్గీకరణను ఏక గ్రీవంగా ఆమోదించడంపై కోసిగి ఎమ్మార్పీఎస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌కు ఎంఎస్‌పీ జిల్లా నాయకులు దుర్గప్ప మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సామేల్, అధికార ప్రతినిధి నరసింహులు, ఉపాధ్యక్షుడు ప్రకాష్ చేరుకుని సంబరాలు చేసుకున్నారు.

26న పాపమాంబ రథోత్సవం



ఆదోని అర్బన్: పట్టణంలోని మరాఠా వాడిలో వెలసిన పాపమాంబ మఠంలో 69వ ఆరాధన మహోత్సవం ఈనెల 26వ తేదీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రమేష్ శుక్రవారం తెలిపారు. 26న ఉదయం వేకువజాము నుంచి పాపమాంబకు అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పాపమాంబ రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'బార్' ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ఆదోని రూరల్: ఆదోని బార్ అసోసియేషన్‌కు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. శుక్రవారం జరిగిన ఈసీ సమావేశంలో ఎన్నికల అధికారిగా విజయభాస్కర్‌రెడ్డి, సహాయాధికారులుగా హనుమేష్, సోమశేఖర్ ఎన్నికయ్యారు. ఈనెల 24వ తేదీ వరకు సబ్‌స్క్రిప్షన్స్, 26న నామినేషన్లు, 27న పరిశీలన, ఏప్రిల్ 2వ తేదీ ఎన్నికలు, అదే రోజు సాయంత్రం ఫలితాలు విడుదల చేస్తామని విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.

విశ్వాసం కోల్పోవడంతోనే అవిశ్వాసం



మాట్లాడుతున్న కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని టౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత ప్రజా, పాలకవర్గ సభ్యుల విశ్వాసం కోల్పోవడం వల్లే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, రాజేశ్వర రెడ్డి, రామలింగేశ్వరయాదవ్, అశోక్, చలపతి, భాస్కర్, రహిమాన్, ఉస్మాన్, ఇబ్రహీం, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ద్వారకా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల మద్దతుతో చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న బోయ శాంత తమపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం, వార్డుల్లోని సమస్యలను పెడచెవిన పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వార్డుల్లో ఒక్క అభివృద్ధి పని చేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను అధికారులు, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోతోందన్నారు. దీంతో అవిశ్వాస తీర్మానం పెట్టామని తెలిపారు. కూటమి నేతలు చెప్పిన విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో 3110 ఎంఎల్‌డీ నీరు నిల్వ ఉండాల్సి ఉండగా కేవలం 1800 ఎంఎల్‌డీ మాత్రమే ఉన్నాయని, ఇలా అయితే పట్టణానికి తాగునీటిని ఎలా అందించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఝూన్సీ లక్ష్మీభాయి కూరగాయల మార్కెట్‌కు సంబంధించి ఓపెన్ టెండర్లలో రూ.18.50 లక్షలు బకాయిలు ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. పది నెలలుగా ఏం పనులు చేశారో చెప్పాలన్నారు. చైర్‌పర్సన్‌గా కొనసాగే అర్హత బోయ శాంతకు లేదన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని భిక్షాటన



భిక్షాటన చేస్తున్న కూలీలు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు


ఆదోని రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు తక్షణమే ఉపాధి బిల్లులు చెల్లించాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం నుంచి భీమా సర్కిల్ వరకు కూలీలు భిక్షాటన చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ.. జనవరి నుంచి ఒక్క రూపాయి వేతనం కూడా కూలీలకు చెల్లించలేదన్నారు. అనేకసార్లు ఆందోళన చేపట్టినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కూలీలకు సకాలంలో వేతనాలు అందించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మణ్, గోపాల్, తిప్పన్న, పాండురంగ, గోవిందు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

ఆదోని రూరల్: ఈనెల 24, 25వ తేదీల్లో జరిగే ఆల్ ఇండియా బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పి.ఎస్.గోపాల్, సహాయ కార్యదర్శి లక్ష్మన్న తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మద్దతు తెలుపుతున్న పోస్టర్లను విడుదల చేశారు. ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఏళ్ల నుంచి ఖాళీ ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. బ్యాంకు ఉద్యోగులంతా ఐక్యమత్యంగా ఉద్యమాలు చేసి కార్మిక హక్కులను రక్షించుకోవాలని పేర్కొన్నారు.

కోసిగి: ఈనెల 24, 25వ తేదీల్లో దేశ వ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు చేపడుతున్న సమ్మెకు తాము మద్దతు తెలుపుతున్నట్లు కోసిగి మండల సీఐటీయూ కార్యదర్శి రాముడు తెలిపారు. శుక్రవారం కోసిగిలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు సీఐటీయూ నాయకులు కలిసి మద్దతు ప్రకటించారు. బ్యాంక్ ఉద్యోగస్తులకు పని ఒత్తిడి తగ్గించి, వారి న్యాయమైన డిమాండ్‌లకు పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు, గురు, వీరేష్, రామాంజినేయులు, ఈరన్న, ముక్రయ్య, రవి పాల్గొన్నారు.

మెడికల్ షాపులపై విస్తృత తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్, వన్‌టౌన్ సీఐ

ఆదోని అర్బన్: పట్టణంలోని మెడికల్ షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈగల్, డ్రగ్స్, లోకల్ పోలీసులు ఆపరేషన్ గరుడ భాగంలో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పర్వీన్, వన్‌టౌన్ సీఐ శ్రీరామ్, ఈగల్ ఎస్ఐ శ్రీహరి, తహసీల్దార్ శివరాముడు ఎనిమిది షాపులపై దాడులు చేశారు. అనుమతులు లేని ట్యాబ్లెట్లు, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మడంతో కేసులు నమోదు చేసి జిల్లా అధికారులకు రిపోర్టు చేశారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేని మందులను స్వాధీనం చేసుకున్నారు.